ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్ : వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.రాజేందర్‌కుమార్ ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగపై ప్రమాణం చేసిన ఎమ్మెల్యే ఒక కులంను అవమానించడం సరైన వి ధానం కాదని, ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రం ఖండిస్తున్నట్లు తెలిపారు. వెలమ కులాన్ని దూషిస్తూ, నానా రకాలుగా మాట్లాడిన శంకర్‌పై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

వెలుగని వీధిదీపాలు.. అంధకారంలో కాలనీలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 8 : హౌసింగ్‌బోర్డు కాలనీ లక్ష్మిగూడలోని చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు వెలుగడం లేదు. సాయంత్రమైతే మహిళలు, చిన్నారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంటున్నది. రాత్రి వాహనాదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు, కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గొడవపడ్డ ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, డిసెంబర్ 8 : రోడ్డు మీద గొడవ పడుతున్న పాత నేరస్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలోస్థానికంగా నివాసముంటున్న పాత నేరస్తులు ఎజాజ్, సోఫియునుద్దీన్, ఫజల్ శనివారం రాత్రి పరస్పరం గొడవపడ్డారు. స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తూ గట్టిగా అరుపులు కేకలతో న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. వీరిపై పలు కేసులున్నాయని, ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోకుండా గొడవలకు దిగుతుండడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ జంక్షన్ కథ మొదటికొచ్చేనా..?

యూసుఫ్‌గూడలో రూ.4.90 కోట్లతో ప్రతిపాదనలు

స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందినా కార్యాచరణకు నోచని దుస్థితి

జూబ్లీహిల్స్, డిసెంబర్ 8 :యూసుఫ్‌గూడ ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు కార్యరూపం దాల్చేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూసుఫ్‌గూడ బస్తీ కూడలిలో సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటుపై జీహెచ్ఎంసీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు, వాహనదారులు, పాదచారులు సమస్యపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూడలిలో రోజురోజుకూ రద్దీ తీవ్ర రూపం దాలుస్తోంది. యూసుఫ్‌గూడ కూడలిలో రూ.4.90 కోట్లతో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందింది. ఐతే ఏడాది కావస్తున్నా కార్యాచరణకు నోచని దుస్థితి నెలకొన్నది. నగరం నలువైపులను అనుసంధానం చేస్తూ బోరబండకు ప్రధాన రహదారిగా ఉన్న అంబేద్కర్ సర్కిల్‌లో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ప్రధానంగా ఈ రోడ్లపై పాదచారుల పరిస్థితి దుర్భరంగా మారింది. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కొంతకాలంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు ట్రాఫిక్ జంక్షన్‌ను ప్రతిపాదనలకే పరిమితం చేశారు.

స్థానికులు స్థలాలు ఇచ్చేందుకు నిరాకరిస్తుండడంతో..

రోడ్డు విస్తరణకు స్థానికులు స్థలాలు ఇచ్చేందుకు నిరాకరిస్తుండడంతో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటులో జాప్యం జరిగే అవకాశాలున్నాయి. యూసుఫ్‌గూడ బస్తీ కూడలి నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయం మీదుగా కృష్ణకాంత్ పార్కు రోడ్డులోని సాయిబాబా టెంపుల్ వరకు రోడ్డు వెడల్పు చేపడుతూ ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలాలు నష్టపోతున్న మధురానగర్ కాలనీ వాసులు క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులను కలిసి రోడ్డు విస్తరణకు తమ ఇంటి స్థలాలు ఇవ్వలేమని చెప్పడంతో ఈ ప్రతిపాదనలు మళ్లీ మొదటికొచ్చేలా కనిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు చేసిన ప్రతిపాదనలు స్టాండింగ్ కమిటీ ఆమోదం పొంది ఏడాది కావస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో ట్రాఫిక్ జంక్షన్ కథ.. మొదటికొచ్చేలా కనిపిస్తున్నది.

యూసుఫ్‌గూడ అంబేద్కర్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు వెళ్తున్న వాహనాలు



సమావేశంలో పాల్గొన్న మాల సంఘాల నాయకులు

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

ఖైరతాబాద్, డిసెంబర్ 8 : మాలలపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మాల మహిళా చైతన్య వేదిక అధ్యక్షులు అంజలి కుమారి అన్నారు.

మాలల సింహగర్జన విజయవంతమైన సందర్భంగా ఆదివారం ఖైరతాబాద్ తుమ్మలబస్తీలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాలల సింహగర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా మాలలు స్వచ్ఛందంగా వచ్చారని, విజయవంతాన్ని చూసి ఓర్వలేకనే మందకృష్ణ అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. మాలలను చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో బాలనర్సమ్మ, శ్వేత, బి.మంగ, సబిత, మౌనిక, లావణ్య, రేణుకా రాణి, సుభాషిణి, శ్రీధర్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ రంగంలోని సమస్యలు పరిష్కరించాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 8 : సెంట్రింగ్ రంగంలో గుత్తేదారులంతా తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు కలిసికట్టుగా ఉండాలని మైలార్‌దేవ్‌పల్లి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు అడికె మల్లేశ్ అన్నారు. ఆదివారం దుర్గానగర్‌లోని సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహించారు. నూతన యూనియన్ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లేశ్ మాట్లాడుతూ.. భవన రంగంలో సెంట్రింగ్ ధరలు నాలుగేండ్ల నుంచి పెరుగలేకపోతున్నాయన్నారు. నిర్మాణ రంగంలో సరైన ధరలు లేక సెంట్రింగ్ గుత్తేదారులు నష్టాలు చవిచూస్తున్నానన్నారు. దీనిని అధిగమించేందుకు అందరం కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెంట్రింగ్ కార్మికులకు చేయూ నందించాల్సిన అవసరం ఉందన్నారు.

యూనియన్ నూతన కార్యవర్గం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నూతన సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షులుగా అడికె మల్లేశ్, ఉపాధ్యక్షులుగా శామర్తి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా గాంధారి వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా ఎం.దేవప్ప, కోశాధికారిగా ఎస్.బాల్‌రాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.అశోక్, బి.ధన్‌రాజ్, ఎ.శంకర్, పి.శేఖర్, సలహాదారులుగా ఎం.దర్శన్, జి.యాదగిరి, సింహాద్రి, జి.రమేశ్, శ్రీనివాస్‌రెడ్డిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు మల్లేశ్

ముదిరాజ్‌ల అభివృద్ధికి సహకరించాలి

కిస్మత్‌పూర్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

బండ్లగూడ : ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి అందరి సహకారం ముఖ్యమని అధ్యక్షుడు నీరుడు శ్రీరాములు ముదిరాజ్ అన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో ముద్ర సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు శ్రీరాములు ముదిరాజ్ మాట్లాడుతూ.. కిస్మత్‌పూర్‌లోని ముదిరాజ్ సంఘం సభ్యులు సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అసోసియేటెడ్ అధ్యక్షుడిగా సిరిమల్ల నారాయణ ముదిరాజ్, గౌరవాధ్యక్షుడిగా మన్నె దశరథ్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా మన్నె మాణిక్‌రావు, మన్నె రవీంద్ర ముదిరాజ్, భుజంగరావు ముదిరాజ్, సి.నరేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మన్నె నవీన్ ముదిరాజ్, జాయింట్ సెక్రటరీగా పోతురాజు, మధుసూదన్ ముదిరాజ్, సి.బాబు ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా నీరుడు సర్వేష్ ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దొంతుల మల్లేశ్ ముదిరాజ్, చిరుముల శ్రీశైలం ముదిరాజ్, ట్రైజరీగా చిలుము ల రవీందర్ ముదిరాజ్, సలహాదారులుగా నీరుడు శేఖర్ ముదిరాజ్, మన్నె సురేశ్ ముదిరాజ్, ఏ కుమార్ ముదిరాజ్, నీరుడు బాల్‌రాజ్ ముదిరాజ్, అమీర్‌గూడెం నర్సింగ్‌రావు ముదిరాజ్, మన్నె చిరంజీవి ముదిరాజ్, మన్నే మహేందర్ ముదిరాజ్ ఎన్నికైయ్యారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

- మణికొండ

ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి, భరతనాట్యం, గాత్ర కచేరి అలరించాయి. నృత్య భూషణ్ డాక్టర్ అంజుబాబు,శ్రీనివాస్,సీనియాక్టర్ చంద్రశేఖర్, కళాకారులు పాల్గొన్నారు.

- రామంతాపూర్

కనుల పండువగా..మహాపడి పూజ



అయ్యప్పస్వామి మహాపడి పూజ మహోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 8 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ జరిగింది. కిషన్‌రెడ్డి దంపతులు అయ్యప్ప విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆత్రేయ చార్యుల గురుస్వామి నేతృత్వంలో స్వాముల భజనల అనంతరం స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, ఎంపీలు ఈటల, డీకే అరుణ, రఘునందన్‌రావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, కార్పొరేటర్లు కన్నే ఉమా రమేశ్‌యాదవ్, అమృత, బీజేపీ నగర ఉపాధ్యక్షుడు పందిర్ల ప్రసాద్, రామస్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్ రాజన్న గుట్ట శివాలయం ప్రాంగణంలో జరిగిన అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ రాజన్న గుట్ట చారిత్రాత్మక శివాలయం ప్రాంగణంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. డాకూరి శివరాజ్ కురుమ 18వ మహాపడి పూజ వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అయ్యప్పస్వామి నామస్మరణతో శోభయమానంగా జరిగింది. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశ్, నార్సింగి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ డి.కృష్ణ, మాజీ సర్పంచ్‌లు గండయ్య, నర్సింహ, వార్డ్ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, డైరెక్టర్లు మాచర్ల రాజు, అరికె మల్లేశ్, అయ్యప్ప స్వాములు, స్థానికులు విచ్చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

ఎయిర్‌పోర్టుకు.. ఉమ్రా యాత్రికులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 8 : మక్కా మదీనా యాత్రను 50 మంది యాత్రికులు పూర్తిచేసుకొని ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్న ఫయాజ్ అలీని అభినందించారు.

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ..

యూసుఫ్‌గూడలో 62 వేల ప్రొఫార్మాలు 6852 ప్రొఫార్మాల డేటా ఎంట్రీ పూర్తి



సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

జూబ్లీహిల్స్, డిసెంబర్ 8 : యూసుఫ్‌గూడ సర్కిల్ సమగ్ర కుటుంబ సర్వే ప్రొఫార్మాలను కంప్యూటరీకరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అమీర్‌పేట్ మైత్రి విహార్‌లోని డేటా ఎంట్రీ సెంటర్‌లో 70 కంప్యూటర్‌లతో 150 మంది ఆపరేటర్లు ప్రతిరోజు డేటా ఎంట్రీ చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ -19 వ సర్కిల్‌లో 74,163 గృహాల లక్ష్యంగా సమగ్ర సర్వే చేపట్టిన అధికారులు ప్రస్తుతం 62 వేల ఆవాసాలలో సర్వే పూర్తిచేశారు. 3 రోజులు డేటా ఎంట్రీ చేపడుతుండగా ఇప్పటికి 6852 ప్రొఫార్మాల డేటా ఎం ట్రీ పూర్తిచేసినట్లు డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. ఒకవైపు డేటా ఎంట్రీ చేపడుతూనే పూర్తికాని గృహాలలో సర్వే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్ అధికారు ల పర్యవేక్షణలో కంప్యూటర్ ఆపరేటర్లు డేటా ఎంట్రీ చేపడుతున్నారు. డీసీ ఆదేశాలతో డేటా ఎంట్రీ ప్రక్రియను యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు పరిశీలించారు.

గాంధీకుటీర్‌లో చోరీ..

హిమాయత్‌నగర్, డిసెంబర్ 8: బీరువాలో భద్రపరిచిన 15 తులాల బంగారం చోరీకి గురైంది. ఈ సంఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీకుటీర్‌లో పెంటయ్య ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లి వచ్చేసరికి బీరువా పగుల గొట్టి ఉంది. అందులో భద్రపరిచిన 15 తులాల బంగారం కన్పించలేదు. ఆందోళన చెందిన పెంటయ్య స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు

ఆర్థిక ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో విద్యావికాస్ ప్రతినిధులు, అతిథులు

ఎర్రగడ్డ : రాజీవ్‌నగర్‌కు చెందిన 'విద్యావికాస్' సంస్థ 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కాలనీలోని క్రీడా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో 80 మంది ప్రతిభాన్విత పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన క్యాపబిలిటీ మెచూరిటీ మోడల్ ఇంటిగ్రేషన్ (సీఎంఎంఐ) టీమ్ మెంబర్ డాక్టర్ వైవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. చదువులో ప్రతిభను కనబర్చుతున్న పేద విద్యార్థులకు 14 ఏండ్లుగా ఆర్థికసాయం అందిస్తున్న సంస్థ సేవలు విస్తరించాలని ఆకాంక్షించారు. విద్యావికాస్ అధ్యక్షుడు కృష్ణశర్మ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సంస్థ తరపున 1428 మందికి రూ.20.66 లక్షల సాయం అందించామన్నారు. ఈసారి 80 మందికి రూ.3.98 లక్షలు అందజేశారు. కార్యక్రమానికి గౌరవాతిథిగా నాగేశ్వరరావు హాజరై సంస్థ ప్రతినిధులను అభినందించారు. విద్యావికాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మోహనరావు, సంయుక్త కార్యదర్శి ఎంవీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృష్ణశర్మను శాలువాతో సన్మానించారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఎల్బీనగర్, డిసెంబర్ 8 : కొత్తపేటలో గౌడ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ సురమాంబ సమేత శ్రీ కంఠ మహేశ్వర స్వామి, శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నంది వాహనం, బలిపీఠం, శ్రీ వన మైసమ్మ దేవి, శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన నూతన శిఖర స్థాపన మహోత్సవాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్, కొత్తపేట గౌడ సంఘం , ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచు దుప్పటిలో కీసర ఆలయం

అసలే చలికాలం ఆపై మంచు కురుస్తుండడంతో జిల్లాలో ప్రసిద్ధ ఆలయమైన కీసరగుట్ట భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఆదివారం ఇలా మంచు దుప్పటి పరిచినట్లుగా కనిపించింది. సెలవుదినం కావడంతో భక్తులు భారీగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ పునర్నిర్మాణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

శ్రీదుర్గామాత ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

అంబర్‌పేట, డిసెంబర్ 8: నల్లకుంట డివిజన్‌లోని టీఆర్టీ కాలనీలో శ్రీ దుర్గామాత దేవాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన ఆదివారం ఉదయం జరిగింది. ముఖ్య అతిథిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గామాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు నల్లా నరేశ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, మురళి, స్వప్న, కరుణాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అంబర్‌పేట, డిసెంబర్ 8 : శారదానగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులతో ఆమె సమావేశమై కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదవరెడ్డి, కార్యదర్శి శేఖర్య, సభ్యులు సన్మానించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

మెహిదీపట్నం : కార్వాన్ నియోజకవర్గం సబ్జిమండిలోని గంగపుత్ర సంఘం వారి వీరాభిమన్యు కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం. సాయిప్రసాద్, కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు.